క్లుప్తంగా

ఎమ్మెల్యేను కలిసిన అధికారులు



ఎమ్మెల్యేను కలిసిన డీడబ్ల్యూవో వాణిశ్రీ

జగిత్యాల: జిల్లా సంక్షేమాధికారిగా నియమితులైన వాణిశ్రీ ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం సంక్షేమ శాఖలో జరుగుతున్న పతకాల తీరుపై చర్చించారు. వారి వెంట కౌన్సిలర్లు కూతురు రాజేశ్, శ్రీకాంత్, ధర్మరాజు తదితరులు ఉన్నారు.

రాయికల్ ఎంపీడీవో..

రాయికల్: మండల ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించిన చిరంజీవి సోమవారం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి, ప్రజల సంక్షేమం, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

కాంగ్రెస్ పార్టీలో పలువురి చేరిక



కాంగ్రెస్ పార్టీలో చేరిన నాయకులు

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం నర్సింహులపల్లి గ్రామ శాఖ అధ్యక్షుడు మాజీ ఎంపీటీసీ సుధ నారాయణ, ఇందారపు గంగాధర్, కట్ట చంద్రయ్య, వెయ్య భాస్కర్ సోమవారం జగిత్యాల జిల్లా కేంద్రంలో ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి జీవన్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి, పార్టీలోకి ఆహ్వానించారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పనిచేస్తామని నాయకులు అన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

మెట్‌పల్లి: పట్టణానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు చెర్లపల్లి ఆనంద్‌గౌడ్ బీఆర్‌ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరారు. ఈ మేరకు సోమవారం హైదరాబాద్ గాంధీభవన్‌లో కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్ కుమార్ గౌడ్, కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు ఆయనకు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.


క్రీడలతో మానసిక ఉల్లాసం



విద్యార్థులకు కప్ అందిస్తున్న నాయకులు

జగిత్యాల: క్రీడలు మానసికోల్లాసానికి తోడ్పడతాయని ట్రస్మా జిల్లా అధ్యక్షుడు శ్రీధర్‌రావు అన్నారు. సోమవారం మానస ఎక్సలెన్స్ స్పోర్ట్స్ మీట్ ముగింపు వేడుకల్లో పాల్గొని మాట్లాడారు. మానస స్కూల్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 15 నుంచి 17 వరకు అథ్లెటిక్స్ స్పోర్ట్స్ మీట్‌లో విద్యార్థులు పాల్గొని ప్రతిభ చాటారన్నారు. విద్యార్థులు ఇలాంటి వాటిలో పాల్గొంటేనే రాష్ట్ర, జాతీయస్థాయిలో రాణిస్తారన్నారు. ఇందులో ప్రతిభ కనబర్చిన వారికి పతకాలు, కప్‌లు అందజేశారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ రాజేందర్, కౌన్సిలర్ శ్రీలత, తిరుమలయ్య, రేణుక, హరిచరణ్‌రావు, శ్రీధర్‌రావు, రజితరావు పాల్గొన్నారు.

పెగ్గెర్లలో ఉచిత నేత్ర వైద్యశిబిరం



గ్రామస్తులకు కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

కథలాపూర్: మండలంలోని పెగ్గెర్లలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహించారు. రేకుర్తి కంటి ఆస్పత్రి వైద్యుల ఆధ్వర్యంలో ప్రజలకు కంటి పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ శిబిరంలో 110 మందికి పరీక్షలు చేయగా.. 32 మందికి ఆపరేషన్ అవసరమని వైద్యులు గుర్తించారు. వీరికి రేకుర్తి కంటి ఆసుపత్రిలో ఉచితంగా ఆపరేషన్ చేయిస్తామని నిర్వాహకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, లయన్స్‌క్లబ్ ప్రతినిధులు మామిడిపెల్లి శ్రీనివాస్‌రెడ్డి, కొమ్ముల కిషన్‌రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

మా భూములు మాకేనని..

- పట్టాలున్నా అడ్డుకుంటున్న అధికారులు
- ప్రజావాణిలో వేములకుర్తి ఎస్సీల ఫిర్యాదు
- తమ భూమి ఇప్పించాలని వేడుకోలు



అటవీ శాఖ అధికారులు సాగుచేయనివ్వని భూమి



పట్టా దారు పాస్‌పుస్తకాలు చూపిస్తున్న మహిళా రైతులు

ఇబ్రహీంపట్నం: ప్రభుత్వం ఇచ్చిన భూమిలో కష్టపడి వ్యవసాయం చేసుకుంటున్న నిరుపేదలను అటవీశాఖ అధికారులు అడ్డుకుంటున్నారు. మండలంలోని వేములకుర్తి గ్రామశివారులోని సర్వే నంబర్ 264/2/7లో 37 మంది ఎస్సీలకు ఒకొక్కరికి 8 గుంటల చొప్పున 7 ఎకరాల 10 గుంటల భూమిని 40 ఏళ్ల క్రితం ప్రభుత్వం ఇచ్చింది. పట్టాలు చేసి పాస్ బుక్కులు కూడ ఇచ్చింది. గత ప్రభుత్వంలో వారికి రైతుబంధు కూడా పొందారు. ఈ భూమిలో అందరూ కలిసి రూ.40వేలతో బావిని తవ్వించి పంటలు పండించుకుంటున్నారు. అయితే మూడేళ్ల క్రితం ఈ భూమి మాదేనంటూ అటవీశాఖ అధికారులు అడ్డుకుని వ్యవసాయం చేయనిస్తాలేరని, దుక్కి దున్నడానికి ట్రాక్టర్లను కూడా రానిస్తాలేరని, కేసులు పెడతామని బెదిరిస్తున్నారని, పట్టాదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ భూమి చుట్టూ రైతులు వివిధ రకాల పంటలను పండించుకుంటుండగా అధికారులు కేవలం తమ భూమిపైనే కన్నేసి అడ్డుకుంటున్నారని వాపోతున్నారు. అటవీ శాఖ అధికారులు తమదే భూమి అంటు అడ్డుకోవడంతో వ్యవసాయం చేసుకోలేకపోతున్నట్లు పట్టాదారులు ఆందోళన చెందుతున్నారు. తమకు ఈ భూమి తప్పా.. ఎక్కడా భూమి లేదని, ఇదే తమకు జీవనాధారం అనిఅంటున్నారు. భూమికి పట్టాలు ఉండి, రైతుబంధు తీసుకుంటున్నామని, ప్రజాప్రతినిధులు, అధికారులకు ఇటీవల ప్రజావాణిలో ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అటవీశాఖ,రెవెన్యూ శాఖ అధికారులతో జాయింట్ సర్వే చేయించి మా భూమిని మాకు ఇప్పించాలని కోరుతున్నారు.

మా భూమి మాకు ఇప్పించాలి



40 ఏళ్ల నుంచి సాగు చేసుకుని పంటలను పండించుకుంటున్నాం. మూడేళ్ల నుంచి అటవీశాఖ అధికారులు ఆ భూమి మాదేనని వ్యవసాయం చేయనిస్తలేరు. మాకు పట్టాలు ఉన్నాయి. మా భూమి మాకు ఇప్పించాలి.

మాట్లరాజు, వేములకుర్తి

ట్రాక్టర్లను రానిస్తలేరు



చేను దున్నడానికి ట్రాక్టర్లను తీసుకుని వెళ్తే అటవీశాఖ అధికారులు కేసులు పెడ్తామని బెదిరిస్తున్నారు. ట్రాక్టర్లను దున్ననిస్తలేరు. మాకు ఉన్నది ఇదే భూమి దిక్కు. అధికారులు, ప్రజాప్రతినిధులు మా భూమి మాకు ఇప్పించాలి.

– మగ్గిడి గంగారం, వేములకుర్తి

జాయింట్ సర్వే చేయిస్తాం



రెవెన్యూ, అటవీశాఖ అధికారులతో జాయింట్ సర్వే చేసి పట్టాదారులకు న్యాయం చేస్తాం. జాయింట్ సర్వే కోసం అటవీశాఖ అధికారులకు లేఖను పంపిస్తాం. వారు ఇచ్చిన సమయం ప్రకారం సర్వే చేస్తాం.

– ప్రసాద్, తహసీల్దార్, ఇబ్రహీంపట్నం

పట్టాదారులను అడ్డుకుంటలేం



పట్టాదారులను అడ్డుకుంటలేం. అటవీశాఖ భూమా, రెవెన్యూ భూమా అని నిర్ధారణ అయ్యే వరకు పంటలు పండించవద్దని తెలిపాను. జాయింట్ సర్వే ద్వారా సర్వే నంబర్ 264 ను నిర్ణయించి, భూమి ఎవ్వరిదని నిర్ధారిస్తాం. – ఎండీ.సౌకాత్ అలీ, ఫారెస్ట్ రెంజ్ అధికారి, మెట్‌పల్లి

కల్యాణలక్ష్మి పథకం ఘనత కేసీఆర్‌దే

- కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్



లబ్ధిదారులకు చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే సంజయ్

కోరుట్ల రూరల్: కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు కేసీఆర్ ఘనతేనని కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ అన్నారు. మండలంలోని యూసుఫ్‌నగర్, అయిలాపూర్, ధర్మారం,తిమ్మయ్యపల్లె, పైడిమడుగు, జోగిన్‌పెల్లి, చిన్నమెట్‌పల్లి, మోహన్‌రావుపేట, గుమ్లాపూర్, వెంకటాపూర్, మాదాపూర్, సంగెం, నాగులపేట గ్రామాలకు చెందిన 46 మంది లబ్ధిదారులకు మంజూరైన కల్యాణ లక్ష్మి చెక్కులను సోమవారం అందజేశారు.పేదింటి ఆడబిడ్డల పెళ్లికి ఇబ్బందులు రావొద్దనే మాజీ సీఎం కేసీఆర్ ఈ గొప్ప పథకాలు ప్రవేశపెట్టారని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ దారిశెట్టి లావణ్య, ఎంపీపీ తోట నారాయణ, వైస్ ఎంపీపీ చీటి స్వరూపారాణి, నాయకులు చీటి వెంకట్రావు, అధికారులు, ఆయా గ్రామాల ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఉత్సవాలకు ముస్తాబైన లక్ష్మీనృసింహ ఆలయం



లింగాపూర్ శ్రీలక్ష్మీ నరసింహ ఆలయం

పెగడపల్లి: మండలంలోని లింగాపూర్‌లో ఈ నెల 20 నుంచి 24 వరకు జరిగే బ్రహ్మోత్సవాలకు శ్రీలక్ష్మీ నృసింహస్వామి ఆలయం ముస్తాబైంది. ఈ మేరకు ఆలయాన్ని రంగు రంగులతో అద్ది, విద్యుత్ దీపాలతో అలకంరించారు. ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 20న, స్వామి వారి తిరుక్కాల్యాణ మహోత్సవం, నందాదీప స్థాపన, అగ్ని ప్రతిష్ఠ, 21న నిత్యహోమం , బలిహరణ, తీర్థప్రసాద వితరణ, కుంకుమార్చన, 22న హోమం, సదస్య మహాదాశీర్వచనం, తీర్థ ప్రసాద వితరణ, 23న అన్నదానం, ఎడ్లబండ్ల పోటీలు 24న, రథహోమం, రథబలి, స్వామి వారి రథోత్సవం, స్వామివారి దర్శనం, ఏకాంతసేవ, తదితర కార్యక్రమాలు జరుగుతాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని నిర్వాహకులు, ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

గ్రామాల్లో స్వామివారి పల్లకీసేవ



స్వామివారిని పల్లకీ సేవకు తీసుకెళ్తున్న భక్తులు

మల్లాపూర్: మండలంలోని రత్నాపూర్ శ్రీ మల్లికార్జున స్వామి జాతర ఉత్సవాలను పురస్కరించుకుని పలుగ్రామాల్లో పల్లకిసేవకు ఆలయ అర్చకులు శివకుమార్ నేతృత్వంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు స్వామి ఉత్సవ విగ్రహాలతో సోమవారం తరలివెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వామి జాతర ఉత్సవాలను 24 నుంచి 27 వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ఉత్సవాల్లో స్వామి వారి కల్యాణం, రథోత్సవం, అగ్నిగుండం, నాగవెల్లి, మహా అన్నదాన కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. నేటి నుంచి ఉత్సవ విగ్రహాలతో పలుగ్రామాల్లో పల్లకి సేవ నిర్వహించి 24న రత్నాపూర్ శ్రీ మల్లికార్జునస్వామి ఆలయానికి చేరుకుంటుందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ దేవ ముత్తమ్మ, మాజీ సర్పంచ్ మేడి అనూష, ప్యాక్స్ వైస్ చైర్మన్ గొండ రాజేందర్, ఆలయ కమిటీ చైర్మన్ దేవ సురేశ్, నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

సోమేశ్వర కొండపై ప్రతిష్ఠాపన ఉత్సవాలు



ప్రతిష్ఠాపన ఉత్సవాల్లో పాల్గొన్న భక్తులు

మల్లాపూర్ : మండలంలోని సోమేశ్వర కొండపై ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ కనకసోమేశ్వర స్వామి ఆలయ ఆవరణలో సోమవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కార్యసిద్ధి వినాయకుడు, సుబ్రహ్మణ్య స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు వేద మంత్రోచ్చారణల మధ్య ఆలయ కమిటీ చైర్మన్ సంగ గంగరాజం-లావణ్య దంపతులు ప్రత్యేక పూజలు చేసి శ్రీ కార్యసిద్ధి వినాయక, సుబ్రహ్మణ్య స్వాముల విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో మల్లాపూర్‌కి చెందిన మకిలి రాజం-గంగు, మకిలి సోమేశ్-వెన్నెల దంపతులు అందించిన విరాళంతో భక్తులకు మహా అన్నదానం చేశారు. కార్యక్రమంలో మండల ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, సోమేశ్వర దీక్షాపరులు, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

శివాజీకి ఘన నివాళి



మోరపల్లిలో శివాజీ విగ్రహానికి పూలమాలలు నివాళి అర్పిస్తున్న నాయకులు



కోరుట్ల సి.ప్రభాకర్ గ్రంథాలయంలో ..



రాయికల్: మైతాపూర్‌లో విగ్రహావిష్కరణ



ఇబ్రహీంపట్నం మండలం గోధూర్‌లో నాయకుల నివాళి



మల్లాపూర్‌లో..

జగిత్యాల/జగిత్యాలరూరల్/ కోరుట్ల /కోరుట్ల రూరల్/ రాయికల్/కొండగట్టు/ మల్లాపూర్/ మల్యాల/ఇబ్రహీంపట్నం/ సారంగాపూర్/కథలాపూర్/ధర్మపురి/ మేడిపల్లి: ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు సోమవారం జగిత్యాల జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని శివాజీ విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. జిల్లా కేంద్రంలో ఛత్రపతి శివాజీ యువసేన ఆధ్వర్యంలో శోభాయాత్ర నిర్వహించారు. మల్యాల మండలం ముత్యంపేటలో, రాయికల్ మండలం మైతాపూర్‌లో శివాజీ విగ్రహాలను ఆవిష్కరించారు. పలు చోట్ల వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ కార్యకర్తలు బైక్ ర్యాలీలు నిర్వహించారు. కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, బజ్‌రంగ్‌దళ్,వీహెచ్‌పీ నాయకులు, అంబేద్కర్ సంఘం, ఆరెకటిక సంఘం నాయకులు,హిందూ ఐక్యవేదిక సభ్యులు,యువకులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

భూసార పరీక్షలపై రైతులకు అవగాహన

కథలాపూర్: మండలకేంద్రంలో వ్యవసాయ కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో రైతులకు భూసార పరీక్షలపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రతీ రైతు పంటల సాగుకు ముందు భూసార పరీక్షలు చేయించుకోవాలన్నారు. అనంతరం ఆయా పంటలకు అవసరమైన మందులను పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఈవో శేఖర్, వినీత, విద్యార్థులు తరుణ్, శ్రీహర్ష, ప్రశాంత్, వామన్ తదితరులు పాల్గొన్నారు.

59 మందికి కల్యాణలక్ష్మి చెక్కులు మంజూరు

కథలాపూర్: మండలంలో 59 మందికి కళ్యాణలక్ష్మి పథకం కింద చెక్కులు మంజూరైనట్లు తహసీల్దార్ ముంతాజిబొద్దిన్ సోమవారం తెలిపారు. లబ్ధిదారుల వివరాలను గ్రామాలవారీగా అధికారులతో సమాచారం అందిస్తామన్నారు. ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ చేతులమీదుగా త్వరలోనే లబ్ధిదారులకు అందిస్తామని పేర్కొన్నారు.

విద్యార్థులకు మినరల్ వాటర్ పంపిణీ

బుగ్గారం: మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్ పదోతరగతి విద్యార్థులకు ఉచితంగా చల్లని మినరల్ వాటర్ పంపిణీ చేయడానికి ధర్మపురి ఏఎంసీ మాజీ డైరెక్టర్ జంగ శ్రీనివాస్ ముందుకొచ్చారు. పరీక్షలు పూర్తయ్యే వరకు చల్లని మినరల్ వాటర్‌ను అందిస్తానని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా హెచ్‌ఎం మోహన్‌రెడ్డి,ఉపాధ్యాయులు శ్రీనివాస్‌ను అభినందించారు.

ఏర్పాట్లు పరిశీలన

పెగడపల్లి: మండల కేంద్రంలో ఈ నెల 21 నుంచి నిర్వహించే వన దేవతల జాతర ఉత్సవాల ఏర్పాట్లను ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి సోమవారం పరిశీలించారు. గ్రామ శివారులో కొలువుదీరిన సమ్మక్క–సారలమ్మ గద్దెలను సందర్శించారు. నీడ, తాగునీటి వసతిపై ఆరా తీసిన ఆయన ఏర్పాట్లపై నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి ప్రవీన్, తాజామాజీ సర్పంచి శ్రీనివాస్, ఆలయ కమిటీ సభ్యులు స్వామి, వెంకటేశం, కొమురెల్లి ఉన్నారు.

బోరుబావి పనులకు భూమిపూజ

కథలాపూర్: మండలంలోని సిరికొండ శివారులో దుర్గామాత ఆలయం వద్ద బోరుబావి పనులకు ఎంపీటీసీ దొప్పల హైమావతి సోమవారం భూమిపూజ చేశారు. మండల పరిషత్ నిధులు రూ. 1.25 లక్షలతో బోరుబావి ఏర్పాటు చేస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో సింగిల్‌విండో డైరెక్టర్లు కందరి కిషన్‌రెడ్డి, చుక్క దేవరాజం, బీఆర్ఎస్ నాయకులు దొప్పల జలంధర్, ఆకుల నర్సయ్య, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణికి అధికారులందరూ హాజరు కావాలి

ఇబ్రహీంపట్నం: ప్రజావాణికి అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని తహసీల్దార్ ప్రసాద్ కోరారు. సోమవారం ప్రజావాణికి ఎచ్‌ఈవో కృపాకర్ , ఐసీడీఎస్ సూపర్ వైజర్ ప్రతిభ ఇద్దరే అధికారులు హాజరయ్యారు. డబ్బా గ్రామానికి చెందిన తేలు సాయమ్మ గ్రామంలో 67వ సర్వే నంబర్‌లో తనకిచ్చిన ప్లాట్‌ను చూపించాలని దరఖాస్తు చేసుకున్నారు.

అభివృద్ధి పనులకు నిధులు మంజూరు

మెట్‌పల్లి: పట్టణంలోని 12వ వార్డులో పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరైనట్లు కాంగ్రెస్ నాయకుడు ఎండీ షాకీర్ తెలిపారు.వార్డులో సీసీ రోడ్డు, డ్రైయినేజీ పనులకు రూ.50 లక్షల నిధులు మంజూరయ్యాయని పేర్కొన్నారు.

'ఎంపీ అర్వింద్‌పై కుట్రలు మానుకోవాలి'

మెట్‌పల్లి: నిజామాబాద్ ఎంపీ అర్వింద్‌పై ఇతర పార్టీ నేతలు కుట్రలు మానుకోవాలని బీజేపీ సీనియర్ నాయకుడు డాక్టర్ చిట్నేని రఘు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.రాజకీయ లబ్ధి కోసమే అర్వింద్‌పై వ్యతిరేక కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో మరోసారి బీజేపీ గెలుపొందడం ఖాయమన్నారు.

పంటలకు నీరందిస్తాం

రాయికల్: రైతులు సాగు చేస్తున్న పంటలకు ఇబ్బంది లేకుండా సాగునీరు అందిస్తామని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. పట్టణానికి చెందిన రైతులు ఎమ్మెల్సీని కలిశారు. చెరువుకు లింక్ ఉన్న డీ–52 కాలువ ద్వారా నీటిని విడుదల చేయాలన్నారు. స్పందించిన ఎమ్మెల్సీ అధికారులతో మాట్లాడి నీటి విడుదలకు చొరవ చూపుతామని హామీ ఇచ్చారు. ఆయన వెంట పార్టీ పట్టణ అధ్యక్షుడు మ్యాకల రమేశ్, నాయకులు పడిగెల రవీందర్‌రెడ్డి, దివాకర్ రెడ్డి, గోపి రాజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీతో ట్రస్మా నాయకుల సమావేశం

జగిత్యాల: ఇటీవల నూతనంగా ఏర్పడ్డ జిల్లా ట్రస్మా కార్యవర్గం ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పాఠశాలల సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు శ్రీధర్ రావు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు

బాధ్యతలు స్వీకరణ

వెల్గటూర్: ఎండపల్లి మండల తహసీల్దార్‌గా రవికాంత్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవలతహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన రాజమణి, ఆరోజు సాయంత్రానికే రిలీవ్ అయి వెళ్లిపోయింది. ఒక్కరోజు లోనే బదిలీ కావడంతో మండలంలో చర్చనీయాంశమైంది. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

కూల్చిన గుడిసెలకు పరిహారం ఇవ్వాలి

కోరుట్ల:పట్టణ శివారులోని జంబిగద్దె ప్రాంతంలోని ప్రభుత్వ స్థలంలో నిరుపేదలు వేసుకున్న గుడిసెలు, ఇళ్లను కాంగ్రెస్ ప్రభుత్వం ఈనెల 16న అర్ధరాత్రి కూల్చివేయడం సరికాదని, బాధితులకు నష్టపరిహారం చెల్లించాలని పట్టణ అఖిలపక్ష నేతలు డిమాండ్ చేశారు. పట్టణంలోని సీ. ప్రభాకర్ భవన్‌లో సోమవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ.. బాధితులకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని సూచించారు. సర్వేనంబర్ 922, 923లో సుమారు 52 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని, ఒక్కో ఇంటికి రూ.లక్ష వరకు అప్పు చేసి నిర్మించుకున్నారని, అయితే అర్ధరాత్రి ఎలాంటి హెచ్చరికలు, నోటీసులు లేకుండా పోలీసు బలగాలతో కూల్చటం సరికాదని పేర్కొన్నారు. అఖిలపక్ష నేతలు చెన్న విశ్వనాథం, సుతారి రాములు, పేట భాస్కర్, చింతా భూమేశ్వర్, ఎండీ చౌదరి, భీమయ్య, నరేందర్, పామల రాజేశం, తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ

మల్లాపూర్: మండలంలోని చిట్టాపూర్‌లో రూ.5 లక్షల ఈజీఎస్ నిధులతో నిర్మిస్తున్న సీసీరోడ్డు పనులకు సోమవారం ఎంపీటీసీ మైస లక్ష్మి, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు ఎల్లాల రాజేశ్ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాలు సంపూర్ణంగా అభివృద్ధి చెందితేనే రాష్ట్రం , దేశం ప్రగతిపథంలో నిలుస్తుందన్నారు. రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కడకుంట్ల సాయికుమార్, యూత్‌కాంగ్రెస్ మండల ప్రధానకార్యదర్శి బలాసాని ప్రణయ్, కిసాన్‌కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎంచిరాల చిన్నారెడ్డి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

తైక్వాండో అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారిగా సంతోష్

జగిత్యాల: గజ్వేల్ జిల్లాలో జరిగిన తెలంగాణ రాష్ట్ర తైక్వాండో అసోసియేషన్ ఎన్నికల్లో రాష్ట్ర అసోసియేషన్ కోశాధికారిగా జిల్లాకు చెందిన సంతోష్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయనను రాష్ట్ర తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్, సెక్రటరీ శ్రీహరితో పాటు, జగిత్యాల జిల్లా డీవైఎస్‌వో రవికుమార్, తైక్వాండో అసోసియేషన్ చైర్మన్ మంచాల కృష్ణ తదితరులు అభినందించారు.

డిగ్రీ సెమిస్టర్ ఫలితాల్లో ఎంజేపీ విద్యార్థుల ప్రతిభ

ధర్మపురి : డిగ్రీ సెమిస్టర్ ఫలితాల్లో మహాత్మ జ్యోతిబాపూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల గురుకుల కళాశాలకు చెందిన విద్యార్థులు కళాశాల టాపర్లుగా తమ ప్రతిభను కనబర్చినట్లు ప్రిన్సిపాల్ రాధాకృష్ణ సోమవారం తెలిపారు. వారిలో బీఎస్సీ, ఎంపీసీ నుంచి సాదుల రామకృష్ణ 8.83, బీఎస్సీ బీజెడ్సీలో బేతి జీవన్ 8.83, బీకాం (సీఎ)లో శివకుమార్ 8.68, బీ.ఏ (ఈపీహెచ్)లో బోడ పవన్ 7.5 జీపీఏ సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్ , అధ్యాపకులు అభినందించారు.

రేణుకా ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు



ప్రత్యేక పూజలు చేస్తున్న నాయకులు

మల్లాపూర్: మండలంలోని ఒబులాపూర్‌లో గౌడ సంఘం ఆధ్వర్యంలో రేణుకా ఎల్లమ్మ ప్రతిష్ఠాపన ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ప్రతిష్ఠాపన ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి ప్రతేక పూజలు వైభవంగా నిర్వహిస్తున్నారు. సోమవారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు సురభి నవీన్‌కుమార్ ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజులు చేశారు. కార్యక్రమంలో గౌడ సంఘం మండల అధ్యక్షుడు ముద్దం సత్యనారాయణగౌడ్, నాయకులు గుండ భూమాగౌడ్, బీజేపీ జిల్లా కార్యవర్గసభ్యుడు గడ్డం నవీన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.